7

సాక్షి
రంగారెడ్డి

గురువారం । 7 । డిసెంబర్ । 2023





వినుమా.. ఎనుముల!

- ట్రాఫిక్ ఇక్కట్లు తగ్గాలి
- నాలా సమస్యలు తీరాలి
- ప్రజా రవాణా పెరగాలి
- సొంతింటి కల నెరవేరాలి
- నడక దారులుండాలి
- మెట్రోను విస్తరించాలి
- నిరుద్యోగులకు హాస్టళ్లు ఉండాలి
- పురోగతిలోని పనులు పూర్తి చేయాలి

కాబోయే సీఎంపై కోటి ఆశలు

సాక్షి, సిటీబ్యూరో: దాదాపు పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టింది. ఆ ప్రభుత్వంపై గ్రేటర్ ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత కూడా వ్యక్తం కాలేదు. గ్రేటర్ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ తిరిగి ఆ పార్టీ అభ్యర్థులనే గెలిపించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కంటే భిన్నంగా కొత్త ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం పని చేయాల్సి ఉంది. బీఆర్ఎస్ పట్టించుకోని అంశాలను, చేయని పనుల్ని చేయాల్సి ఉంది. మరోవైపు అది చేపట్టిన పనుల్ని కొనసాగించాల్సి ఉంది.

- కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాల్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాల్సి ఉన్నందున వాటిని అమలు చేస్తూనే.. మరోవైపు నగరానికి కొన్ని పనుల్ని ప్రాధాన్యతతో త్వరితంగా పూర్తి చేయాల్సి ఉంది. హైదరాబాద్‌ను డల్లాస్‌గా మారుస్తానన్న సీఎం కేసీఆర్ రాష్ట్ర సచివాలయం ముందు, సీఎం క్యాంపు కార్యాలయం ముందు కూడా రోడ్లు చెరువులుగా మారుతున్న దుస్థితిని మార్చలేదని విమర్శించిన రేవంత్‌రెడ్డికి నగరంలోని వరదల సమస్యలు తెలుసు. ఎంపీగా ఉన్న ఆయన జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశాలకూ ఎక్స్ అఫీషియో సభ్యునిగా హాజరై పలు పర్యాయాలు ప్రజావాణిని వినిపించారు. తన పార్లమెంట్ నియోజకవర్గం మల్కాజిగిరి సమస్యలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.
- నగర ప్రజలు కోరుకుంటున్న ప్రాధాన్యతాంశాల్లో కూడా నాలాలున్నాయి. వాటి ఆధునికీకరణను సత్వరమే పూర్తిచేసి వరద సమస్యలనుంచి గట్టెక్కించాలి. ఈ సమస్య పరిష్కారానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ కింద పనులు చేపట్టినప్పటికీ పూర్తికాలేదు. వీటితో పాటు గ్రేటర్‌లోని 185 చెరువుల్ని పునరుద్ధరిస్తేనే సమస్య పరిష్కారమవుతుంది. ఎస్ఎన్‌డీపీ పనులే కొనసాగిస్తారో లేక కొత్త పథకం చేపడతారో తెలియదు. ఏం చేసినా ప్రజలకు కావాల్సింది సమస్య పరిష్కారం. ప్రశ్నించే గొంతుగానే కాకుండా క్షేత్రస్థాయి సమస్యలు కూడా తెలిసి ఉండటంతో నగర ప్రజలు తమ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించగలదని ఆశ పడుతున్నారు. పార్టీ మేనిఫెస్టోలోనూ పలు కార్యక్రమాలున్నాయి.

నగర వాసులు ఆశిస్తున్నవి ఇవీ..

- నగరంలో ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టినా, మెట్రో అందుబాటులోకి వచ్చినా ట్రాఫిక్ చిక్కులు తీరలేదు. వీటిని పరిష్కరించాలి. మెట్రో రైళ్లలో ప్రయాణించే వారికి సెట్విన్ బస్సుల ద్వారా లాస్ట్‌మైల్ కనెక్టివిటీ పెంచాలి. మెట్రో మార్గాన్ని నగరం నలువైపులకూ విస్తరించాలి. ఇస్నాపూర్, శంషాబాద్, హయత్‌నగర్, యాదాద్రిల దాకా పొడిగించాలి.
- ప్రధాన రహదారుల నిర్వహణ ఫర్వా లేకపోయినప్పటికీ, అంతర్గత రోడ్ల పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. అన్ని కాలనీలు, బస్తీలకు మంచి రోడ్లు ఉండాలి.
- గ్రేటర్‌లో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఏడు లక్షలమంది ఉన్నారు. దరఖాస్తు చేసుకోని వారూ ఎందరో ఉన్నారు. నగరంలోని పేదల అతి పెద్ద సమస్య ఇది. వారి సంపాదనలో సగం ఇంటి అద్దెలకే పోతోంది. ఈ అంశానికి ప్రాధాన్యతనిచ్చి పేదల కలలు సాకారం చేయాలి. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి.
- ఉద్యోగాల కల్పన కచ్చితంగా అమలు చేయాలి. కోచింగ్‌ల కోసం జిల్లాల నుంచి వచ్చి ఎందరో నిరుద్యోగులు హాస్టళ్ల ఫీజులు భరించలేకపోతున్నారు. ఉచితంగా లేదా తక్కువ అద్దెలతో వారి కోసం కొన్ని హాస్టళ్లు నిర్మించాలి.
- పనుల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా యాప్స్ ద్వారానే స్టేటస్‌ను తెలుసుకునేలా, పనిచేయని అధికారులపై చర్యలు తీసుకునేలా సాంకేతిక విధానాలు అమలు చేయాలి. ఇటీవల ఏర్పాటైన వార్డు కార్యాలయాలు సవ్యంగా పనిచేసేలా తగిన చర్యలు తీసుకోవాలి. ఆరు గ్యారంటీలను, మేనిఫెస్టోలోని అన్ని అంశాలను అమలు చేయడంతో పాటు నగర మేనిఫెస్టోకు తగిన ప్రాధాన్యతనివ్వాలి.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో నగరానికి సంబంధించినవి..

- జీహెచ్ఎంసీని లోకల్ గవర్నమెంట్‌గా ప్రకటించడంతోపాటు తగిన అధికారాలు, నిధులు. పేద బస్తీల్లోని వారికీ అందరి మాదిరిగా కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, నాణ్యమైన విద్యుత్, విద్య, వైద్యం, హెల్త్‌కార్డులు.
- వీధి వ్యాపారులకు కాంప్లెక్సుల నిర్మాణం. లైసెన్సులు. మూసీ పరిరక్షణకు కొత్త అథారిటీ ఏర్పాటు. సుందరీకరణకు చర్యలు. ఓల్డేజ్ హోమ్స్, మురికివాడల్లో కమ్యూనిటీ టాయ్‌లెట్స్ నిర్మాణం.
- గుంతల్లేని రోడ్లు. ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు. టెలిఫోన్, విద్యుత్, పాస్‌పోర్ట్, కుల ధ్రువీకరణ, బర్త్, డెత్ తదితర సర్టిఫికెట్లన్నీ ఒకే చోట నుంచి సులభంగా జారీ. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు, ఇతరత్రా ఇలా ఎన్నో ఎన్నెన్నో!

కొత్త ప్రభుత్వానికి బల్దియా నివేదిక

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో గురువారం కొత్త ప్రభుత్వం ఏర్పాటవుతున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ స్థితిగతుల గురించి అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. జీహెచ్ఎంసీ ఆర్థిక స్థితిగతులతో పాటు వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్సార్‌డీపీ), వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ), సమగ్ర రహదారుల నిర్వహణ పథకం(సీఆర్ఎంపీ), తదితర పనుల వివరాలతోపాటు వాటిల్లో ఇప్పటికే పూర్తయినవి, పురోగతిలో ఉన్నవి, కొనసాగుతున్న పనుల వివరాలు.. వాటికయ్యే వ్యయం వివరాలు తదితరాలతో నివేదికలో పొందుపరిచారు. దీంతో పాటు గత ఐదేళ్లుగా జీహెచ్ఎంసీ ఆదాయం, వ్యయం, ఆర్థిక సంస్థల నుంచి పొందిన రుణాలు తదితర వివరాలు నివేదించారు. జీహెచ్ఎంసీలోని మొత్తం పోస్టులు, భర్తీ కావాల్సిన ఖాళీ పోస్టుల వివరాలు తదితరాలను సైతం నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది.



రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లే ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది



రేవంత్‌రెడ్డి నివాసానికి అంతరాయం లేని కరెంటు సరఫరా కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

కాబోయే సీఎం వస్తున్నారని..!

రేవంత్‌రెడ్డి ఇంటి దారిలో.. చకా చకా పనులు

బంజారాహిల్స్: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో బుధవారం జూబ్లీహిల్స్ రోడ్ నెం. 44లోని ఆయన ఇంటికి దారితీసే అన్ని మార్గాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తదితర మరమ్మతులు చేపట్టారు. రహదారులకు ఇరువైపులా ఉన్న చెత్తను, చెట్ల కొమ్మలను తొలగించారు. ఆయన ఇంటికి అంతరాయం లేని కరెంటు కోసం కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. మరోవైపు వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టారు. డ్రెయినేజీ ఓవర్‌ఫ్లో లేకుండా జలమండలి సిబ్బంది చర్యలు తీసుకున్నారు. మరోవైపు పోలీసులు పికెటింగ్‌లు ఏర్పాటు చేశారు. అనుమానితులు అటువైపు రాకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి రేవంత్‌రెడ్డి స్వగృహానికి చేరుకోనున్నారు.



న్యూస్‌రీల్

రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజీనామా



రాజావరప్రసాద్

షాద్‌నగర్: రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ బాధ్యతలకు రాజావరప్రసాద్ రాజీనామా చేశారు. బుధవారం ఆయన రాజీనామా పత్రాన్ని సహకార సంఘం మేనేజింగ్ డైరెక్టర్ అరుణ గోపరాజు ద్వారా సహకార శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుకు పేషీకి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఓటమి చెందడంతో చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సహకార సంఘం బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై తాను రూపొందించిన ప్రత్యేక నివేదికను ప్రభుత్వానికి పంపించానని తెలిపారు, చైర్మన్‌గా పని చేసే అవకాశాన్ని కల్పించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కూనంనేనికి ఘన సన్మానం



ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: కొత్తగూడెం శాసనసభ్యుడిగా ఎన్నికైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. నగరంలోని హిమాయత్‌నగర్‌లో ఉన్న సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో షాద్‌నగర్ సీపీఐ నాయకులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ పానుగంటి పర్వతాలు, కోకన్వీనర్లు బుద్దుల జంగయ్య, శ్రీను, జిల్లేడు చౌదరిగూడ మండల కార్యదర్శి వెంకటేశ్, నందిగామ మండల కార్యదర్శి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అమాత్యులెవరో?

- సిటీలో ఖాతా తెరవని కాంగ్రెస్
- ఉమ్మడి జిల్లాలో లక్కు ఎవరికో..?
- నేడు మంత్రి వర్గ ప్రమాణ స్వీకారం నేపథ్యంలో జోరుగా చర్చ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ నూతన కేబినెట్‌లో గ్రేటర్ జిల్లాల నుంచి ఎవరికి అమాత్య పదవి వరిస్తుందోనని సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 15 అసెంబ్లీ సెగ్మెంట్‌లుండగా ఇక్కడ హస్తం బోణీ కొట్టలేదు. దీంతో నగరం నుంచి మంత్రి వర్గంలో సిటీ ప్రాతినిధ్యం లేనట్లే. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 17 నియోజకవర్గాలకు గాను ఏడు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, షాద్‌నగర్, వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ సెగ్మెంట్‌లు హస్తగతమయ్యాయి. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విజయం సాధించిన కొడంగల్ నియోజకవర్గం వికారాబాద్ జిల్లాలో ఉంది. జిల్లా నుంచే సీఎంగా అవకాశం దక్కడంతో ఆ జిల్లాకు మరొకరికి మంత్రి పదవి దక్కే అవకాశం తక్కువే. రంగారెడ్డి జిల్లా నుంచి గెలుపొందిన ముగ్గురు అభ్యర్థుల్లో ఒకరికి బెర్త్ కన్ఫర్మ్ అంటూ ప్రచారం సాగుతోంది.

మల్‌రెడ్డికా? రామ్మోహన్‌రెడ్డికా?

రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలుండగా ఇబ్రహీంపట్నం సెగ్మెంట్ నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, కల్వకుర్తి నుంచి కసిరెడ్డి నారాయణరెడ్డి, షాద్‌నగర్ నుంచి వీర్లపల్లి శంకరయ్య గెలుపొందారు. వీరిలో ప్రస్తుత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో మలక్‌పేట్ నియోజకవర్గం నుంచి 1994, 2004లో రెండు పర్యాయాలు శాసనసభకు ఎంపికయ్యారు. నియోజకవర్గ పునర్విభజన అనంతరం ఆయన 2009లో ఇబ్రహీంపట్నం నుంచి, 2014లో మహేశ్వరం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2018లో ఇబ్రహీంపట్నం నుంచి పొత్తులో భాగంగా కాంగ్రెస్ నుంచి టికెట్ దక్కకపోవడంతో బీఎస్పీ నుంచి బరిలో నిలిచి స్వల్ప తేడాతో ఓటమిని చవిచూశారు. తాజాగా ఇదే స్థానం నుంచి భారీ మెజార్టీతో గెలుపొందారు. ఏవిధంగా చూసినా జిల్లా నుంచి సీనియర్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి మాత్రమే ఉన్నారు. రంగారెడ్డి జిల్లాకు మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని భావిస్తే ఆయనకే దక్కే ఛాన్స్ ఉంది. అధికారికంగా ఎటువంటి ప్రకటన లేనప్పటికీ ఆయన క్రీడల శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని అభిమానులు, పార్టీ కేడర్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ఒక వేళ వికారాబాద్ నుంచి అవకాశం కల్పించాలని భావిస్తే డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అందరికంటే ముందు వరసలో ఉండే అవకాశం ఉంది.

వ్యాక్సినేషన్ వివరాల నమోదు తప్పనిసరి



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ జయలక్ష్మి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి

కొత్తూరు: వ్యాక్సినేషన్ల వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని షాద్‌నగర్ ఏరియా డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి ఆదేశించారు. బుధవారం ఆమె మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ సబ్‌సెంటర్‌ను పరిశీలించి ఏఎన్ఎంలకు పలు సూచనలిచ్చారు. అనంతరం టీకా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ హరికిషన్, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది ఉన్నారు.

నిఘా నీడలో..

- సీఎం ప్రమాణ స్వీకారానికి భారీ భద్రత
- పటిష్ట బందోబస్తుకు ప్రణాళికలు సిద్ధం
- ఎల్బీ స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: సీఎల్పీ నేతగా ఎన్నికైన రేవంత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎల్బీ స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమానికి నగర పోలీ సు విభాగం పటిష్ట భద్రత, బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది. సాధారణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం కోసం ఎల్బీ స్టేడియంలో మూడు స్టేజ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిపై ఉండే ప్రముఖుల వివరాల ఆధారంగా బందోబస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. బుధవారం స్టేడియంలోకి వెళ్లిన సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య, మాజీ కొత్వాల్ సీవీ ఆనంద్ సహా ఇతర ఉన్నతాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గురువారం ఉదయం 10 గంటల నుంచే బందోబ స్తు సిబ్బంది విధుల్లో ఉండనున్నారు. దీనికోసం పోలీసు విభాగం దాదాపు 2వేల మందిని వినియోగిస్తోంది. బుధవారం మధ్యాహ్నం స్టేడియం వద్దకు వచ్చిన బలగాలు రిహార్సల్స్ పూర్తి చేశాయి.

ఏర్పాట్లు ఇలా..

జూబ్లీహిల్స్‌లోని రేవంత్‌రెడ్డి నివాసం నుంచి ఎల్బీ స్టేడియం వరకు ఉన్న మార్గం పర్యవేక్షణకు ప్రత్యేక రూట్ పార్టీ ఏర్పాటు చేస్తున్నారు. ఆయా మార్గాలను ప్రత్యేక బాంబు నిర్వీర్య బృందాలతో అడుగడుగునా తనిఖీ చేయిస్తున్నారు. ఎల్బీ స్టేడియం చుట్టూ అనునిత్యం పెట్రోలింగ్ నిర్వహించడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపుతున్నారు. బందోబస్తు, భద్రత విధుల్లో సీఎం సెక్యూరిటీ విభాగంతో పాటు ఆక్టోపస్, శాంతి భద్రతలు, టాస్క్‌ఫోర్స్, సిటీ సెక్యూరిటీ వింగ్, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, సీఏఆర్ విభాగా లు, సాయుధ బలగాల సిబ్బంది పాల్గొనున్నారు. గురువారం ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లో నిఘా, తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు పెద్ద ఎత్తున మఫ్టీ పోలీసులను మోహరించనున్నారు. రూఫ్ టాప్ వాచ్ కోసం స్టేడియం చుట్టుపక్కల ఎత్తైన బిల్డింగ్స్‌పైన సుశిక్షితులైన సాయుధ బలగాలను మోహరిస్తున్నారు. స్టేడియం చుట్టూ రహదారుల్లో నిలిచిపోయిన ప్రజల సౌకర్యార్థం దాదాపు ఆరు భారీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని పోలీసులు ప్రతిపాదించారు.

ట్రాఫిక్ ఆంక్షలు..

ఎల్బీ స్టేడియంలో కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇవి అమలులో ఉండనున్నాయి. వాహన చోదకులు వీటిని దృష్టిలో పెట్టుకుని తమకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు. ఎలాంటి సహాయ సహకారాలు కావాల్సి వచ్చినా ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నెంబర్ 90102 03626లో సంప్రదించాలని ట్రాఫిక్ చీఫ్ సూచించారు. వీఐపీలు, ఆహుతులతో పాటు సాధారణ ప్రజల కోసం ఆరు ప్రాంతాల్లో ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించారు.

- నిర్ణీత సమయాల్లో సాధారణ వాహన చోదకులను ఏఆర్ పెట్రోల్ పంప్–బీజేఆర్ విగ్రహం బషీర్‌బాగ్ మార్గాల్లోకి అనుమతించరు.

సైన్స్ ఫెయిర్లతో సృజనాత్మకత



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న వినాయకరెడ్డి, జ్ఞానేశ్వర్

సీఐ వినాయకరెడ్డి

శంకర్‌పల్లి: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు సైన్స్‌ఫెయిర్‌లు ఎంతో ఉపయోగపడతాయని శంకర్‌పల్లి సీఐ వినాయకరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. సీజీఐ, ఎల్ఎల్ఎఫ్, ఏఐఎం, నీతి ఆయోగ్ సంయుక్తంగా బుధవారం శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాలలో స్టెమ్ స్పార్క్ ఇన్నోవేషన్ ఫెస్ట్ (2023–24) సైన్స్‌ఫెయిర్ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో వరంగల్, భద్రాచలం, సిద్దిపేట, హైదబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన 15 జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాల విద్యార్థులు.. 50కి పైగా సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను అతిథులు పరిశీలించిన అంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మండల విద్యాధికారి అక్బర్, ఆదర్శ పాఠశాల ప్రిన్స్‌పాల్ ఉమా మహేశ్వర్‌రావు, పలు సంస్థల సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదిగో పులి..

- చేవెళ్ల మండలంలో పులి సంచరిస్తోందంటూ పుకార్లు
- గ్రామాల్లో ఫారెస్టు అధికారుల పరిశీలన
- ఆనవాళ్లేమీ కనిపించలేదని వెల్లడి


ముడిమ్యాలలో స్థానికులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారులు

చేవెళ్ల: చేవెళ్ల మండలంలో పులి తిరుగుతుందనే ప్రచారం 15రోజులుగా సోషల్ మీడియాలో చకర్లు కొడుతూనే ఉంది. మా గ్రామంలో కనిపించిందని ఒకరోజు అంటే మరోరోజు మా గ్రామంలో కనిపించిందని వాయిస్ మేసేజ్‌లు వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి. మండలంలోని ముడిమ్యాల అటవీ ప్రాంతంలో మంగళవారం.. రోడ్డు పక్కన, గ్రామ సమీపంలో కనిపించిందనే వాయిస్ మేసేజ్‌లు వాట్సప్ గ్రూప్‌లో హల్‌చల్ చేశాయి. ఈ విషయం గ్రామంలో తెలియటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆలూరు, కమ్మెట, ఊరేళ్ల, మొండివాగు, తంగడపల్లి, ముడిమ్యాల, కందవాడ తదితర గ్రామాల్లో పులి కనిపించిందంటూ పుకార్లు తిరుగుతున్నాయి. దీంతో ప్రజలు భయం గుప్పిట్లో గడుపుతున్నారు.

భయపడాల్సిన పనిలేదు

ఈ క్రమంలో బుధవారం ముడిమ్యాల గ్రామం, అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రతిమ, వైల్డ్ ఆనిమల్ ఎక్స్‌పర్ట్ జలీల్ మండలంలోని ముడిమ్యాల గ్రామం, అటవీ ప్రాంతంలో పరిశీలించారు. పులికి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని తెలిపారు. గ్రామస్తులు చెప్పిన ప్రదేశాల్లో కూడా పరిశీలించామని ఆయా గుర్తులు కూడా పులివి కానీ, చిరుతవి కానీ కావాని అవి సాధారణంగా ఉండే జంతువులవేనని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. కెమెరాలు అమర్చామన్నారు. ప్రజలు ఒంటిరిగా బయటకు వెళ్లవద్దన్నారు.

కెమెరాలు అమర్చాం



పెద్ద పులి ఇలాంటి ప్రదేశాల్లో తిరిగే అవకాశం లేదు. ప్రజలు రాత్రివేళల్లో ఒంటరిగా తిరగవద్దు. ఒకవేళ వెళ్తే చేతిలో కర్ర పట్టుకొని వెళ్లాలి. ముందు జాగ్రత్తగా గ్రామస్తులు చెప్పిన ప్రాంతాలతో పాటు అటవీ ప్రాంతంలో ప్రత్యేక కెమెరాలను అమర్చామన్నారు.

– ప్రతిమ, ఫారెస్టు రేంజ్ అధికారి

ఓడినా.. నైతిక విజయం మనదే


సమావేశంలో మాట్లాడుతున్న భీంభరత్

చేవెళ్ల కాంగ్రెస్ నాయకులతో భీంభరత్

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ స్వల్ప మెజార్టీతో ఓడినప్పటికీ నైతికంగా విజయం సాధించినట్లేనని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. చేవెళ్లలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారని వారందరికి పాదాభివందనం చేస్తున్నట్లు చెప్పారు. తాను స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోవటం జరిగిందని.. దీనికి కారణం కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా గట్టిగా లేకపోవటంతోపాటు కమిటీలు లేకపోవడమేనని తెలిపారు. అవతల పోటీలో ఉన్న అభ్యర్థి రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసిన వ్యక్తి కావటంతో పాటు అధికార పార్టీ బలం, గ్రామాల్లో బలమైన ప్రజాప్రతినిధులు, కేడర్ ఉండటంతో వారిని బలంగా ఢీకొట్టి పార్టీకోసం అందరూ కలిసి పనిచేశారని చెప్పారు. అందరి కష్టం ఫలితంగానే మనం గట్టి పోటీ ఇచ్చామన్నారు. మనం ఇక్కడ ఓడినా మన పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని మన వెనక గట్టి బలం ఉందనే అందరూ విశ్వసించాలన్నారు. ఇక రాబోయే అన్ని ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, పీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సీనియర్ నాయకులు బల్వంత్‌రెడ్డి, ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్లలో స్వల్ప మెజార్టీతో ఓడిన పామెన భీంభరత్‌కు ఏదైనా నామినేటెడ్ లేదా ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని కోరారు. అప్పుడే పార్టీ నియోజకవర్గంలో మరింత బలపడుతుందని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని భీంభరత్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నాయకులు వసంతం, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, టేకుపల్లి శ్రీనివాస్, మధుసూదన్‌గుప్తా, ప్రభాకర్, క్రిష్ణగౌడ్, శైలజ, సమత, నర్సింహులు, మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్‌బాబు, శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, తరుణ్, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మంచిరోజులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సీఎల్పీ నేత, తెలంగాణ రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి మంచి రోజులు రాబోతున్నాయని.. ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

శంకర్‌పల్లి రైల్వే ట్రాక్ సమీపంలో..

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


కుమార్ మృతదేహం

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి పీఎస్ పరిధిలోని రైల్వే ట్రాక్ పక్కన గల పంట పొలాల్లో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి శవమై కనిపించిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. శంకర్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని అలాన్‌ఖాన్‌గూడ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన చిన్నారెడ్డిగూడకి చెందిన కుమార్(32) మంగళవారం ఉదయం 9గంటలకు శంకర్‌పల్లికి వెళ్లాలని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేదాడు. కాగా బుధవారం మధ్యాహ్నం శంకర్‌పల్లి పట్టణ శివారులోని రైల్వే ట్రాక్ పక్కన గల పంట పొలాల్లో రైతులకు ఓ గుర్తు తెలియని శవం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వివరాలను సేకరించగా చిన్నరెడ్డిగూడ గ్రామానికి చెందిన కుమార్‌గా గుర్తించారు. మృతుడి ఒంటిపై ఎటువంటి గాయాలు లేవని చెప్పారు. మద్యం మత్తులో ట్రాక్‌వద్దకు వెళ్లి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డిటెక్టివ్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

కస్టమర్‌లా వచ్చి.. బంగారం కొట్టేశారు

- చైన్ ఎత్తుకెళ్లిన మహిళ అరెస్ట్
- దుకాణంలో విక్రయించిన నిందితురాలు


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, చిత్రంలో నిందితురాలు భార్గవీరెడ్డి

లాలాపేట: కస్టమర్‌లాగా వచ్చి బంగారు నగలను అపహరించుకుని వెళుతున్న ఓ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన మేరకు.. గత నెల 24న మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని మహిళ హబ్సిగూడలోని మలబార్ గోల్డ్ స్టోర్‌కు వచ్చింది. బంగారు గొలుసులు చూపించమని విధుల్లో ఉన్న సేల్స్ ఎగ్జిక్యూటివ్ అంకుష్ సుగంధిని అడిగారు. ఈ క్రమంలో అతడు బంగారు గొలుసును చూపించాడు. ట్రేలోని ఒక బంగారు గొలుసు తీసుకుని ఆ మహిళ తన మెడలో వేసుకుంది. అదే సమయంలో మరొక మోడల్ గొలుసు చూపించాలని ఆ మహిళ అడుగగా మరికొన్ని చూపించేందుకు సేల్స్ మ్యాన్ తీసుకు వచ్చే లోపు ఒరిజినల్ బంగారు గొలుసు స్థానంలో నకిలీ గొలుసు పెట్టింది. మెడలో వేసుకున్న అసలు గొలుసును అపహరిరంచుకుని వెళ్లింది. హబ్సిగూడలో ఆర్టీసి బస్ ఎక్కి పంజాగుట్టలో దిగింది. అక్కడే ఉన్న అట్టికా గోల్డ్ షాపులో అపహరించిన గోల్డ్ చైన్‌ను విక్రయించింది.ఆ గొలుసు దాదాపు 39.962 గ్రాములు. దీన్ని విక్రయించగా వచ్చిన రూ 2,08,500 మొత్తాన్ని నిందితురాలి హెచ్‌డిఎఫ్‌సి ఖాతాకు బదిలీ చేశారు. అనంతరం ఆమె ఆన్ లైన్‌లో ఆ నగదును తన స్నేహితుడికి ట్రాన్స్‌ఫర్ చేసింది. మరుసటి రోజు గత నెల 25న హబ్సిగూడలోని మలబార్ గోల్డ్ షాపులో బంగారు గొలుసుల స్టాక్‌ను తనిఖీ చేస్తుండగా ఒక ట్రేలో నకిలీ గొలుసు కనిపించింది. దీంతో సేల్స్ ఎగ్జిక్యూటివ్ చేసిన ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా ఆ మాయ కిలేడి భార్గవీరెడ్డి నగరంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితురాలు చిత్తూరు జిల్లా తిరుపతి భవాని నగర్‌కు చెందినదిగా గుర్తించారు. ఈమె కొంత కాలం టూర్స్ అండ్ ట్రావెల్స్ వ్యాపారం నిర్వహించింది. నష్టాల్లో నుంచి గట్టెక్కడానికి సులువుగా డబ్బులు సంపాదనకు ఈ ప్లాన్ వేసిందని పోలీసుల విచారణలో తేలిందన్నారు. కాగా అట్టికా గోల్డ్ కంపెనీకి చెందిన మెనేజర్, ఓ ఉద్యోగి పరారిలో ఉన్నారు.

ఆయోధ్య రామమందిర పూజిత అక్షింతల పంపిణీ


అక్షింతలను పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ నేతలు, స్వామీజీలు

కాచిగూడ: జనవరి 22న అయోధ్యలో శ్రీరాముల వారి ప్రాణ ప్రతిష్ఠ రోజు ప్రతి హిందువూ దీపావళి జరుపుకోవాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత కార్యదర్శి శాలివాహన పండరినాథ్ అన్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుండి వచ్చిన పూజిత అక్షింతలను బుధవారం కాచిగూడ శ్యాంమందిర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో భవ్య రామ మందిర నిర్మాణం ప్రతి ఒక్క హిందువు కల అని అన్నారు. అయోధ్య నుండి తీసుకువచ్చిన పూజిత అక్షింతలు ప్రతి ఇంటి గడపగడపకు ప్రతి హిందూ ఇంటికి చేరవేస్తామన్నారు. జనవరి 22న అయోధ్యలో జరుగబోయే రాముని ప్రాణ ప్రతిష్ఠ రోజు తమ పూజా గదిలో పూజాది కార్యక్రమాలు చేసి పూజిత అక్షతలు తమ తలపై వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వామీజీలు జయరాం స్వామి, వెంకటేశ్వరచార్యులు స్వామి, ఆత్మానంద స్వామి, యోగేష్ ప్రభు స్వామి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల చోరీ కేసులో నిందితులకు జైలు


పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

అత్తాపూర్: సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశ్యంతో సెల్‌ఫోన్ల దొంగతానికి పాల్పడిన ఇద్దరు యువకులకు జైలు శిక్ష పడింది. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, రాజేంద్రనగర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.నరసింహ తెలిపిన వివరాల ప్రకారం బండ్లగూడ మహమూద్‌నగర్ ప్రాంతానికి చెందిన నూరుల్లా హుస్సేన్ (25), అంజద్ ఖాన్ (21)లలో ఒకరు ఆటో డ్రైవర్‌గా మరోకరు ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నారు. కాగా ఈ నెల 3వ తేదీన మహ్మద్ జావేద్ ఏర్పాటు చేసుకున్న సెల్‌ఫోన్ల దుకాణంలో ఇద్దరు కలిసి 50 సెల్‌ఫోన్లను దొంగలించారు. దీనిపై మహ్మద్ జావేద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి దొంగలించిన సెల్‌ఫోన్లను మొత్తం రీకవరి చేసి, వారిని అరెస్ట్ చేసి చర్లపల్లి జైలుకు తరలించారు.

బైక్ అదుపు తప్పి..

యువకుడి దుర్మరణం

కందుకూరు: బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన ఎండీ.జావేద్(23) కందుకూరులోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి బైక్‌పై స్నేహితులతో కలిసి హైదరాబాద్ బయలుదేరాడు. మార్గ మధ్యలో శ్రీశైలం రహదారి కందుకూరు చౌరస్తా వద్ద స్కూటీని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో జావెద్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మిగతా ఇద్దరు స్నేహితులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగికదాడి

ముగ్గురిపై పోక్సో కేసు

వెంగళరావునగర్: ఇంటి నుంచి పాల ప్యాకెట్ కోసం బయటకు వచ్చిన బాలికను తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన కేసులో ముగ్గురు యువకులపై మధురానగర్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... మోతీనగర్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలిక(17) గత నెల 25న తన ఇంటి నుంచి పాల ప్యాకెట్ కోసం బయటకు వచ్చింది. షాపు వద్దకు వెళ్లడానికి దారిలో నడుస్తుండగా గుర్తు తెలియని ముగ్గురు యువకులు కారులో వచ్చి ఆమెకు మాయమాటలు చెప్పి వాహనంలో ఎక్కించుకుని వెళ్లారు. కొంత సమయం తర్వాత గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. అక్కడ నుంచి తప్పించుకుని వచ్చిన బాలిక తల్లిదండ్రులకు తెలియజేసింది. వారు మంగళవారం అర్ధరాత్రి మధురానగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును విచారించి జీరో ఎఫ్ఐఆర్‌తో గుర్తు తెలియని ముగ్గురు యువకులపై పోక్సో కేసు నమోదు చేశారు. బుధవారం ఈ కేసును సనత్‌నగర్ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేసినట్లు పోలీసులు తెలియజేశారు. బాలికలు, మహిళలపై అఘాయిత్యానికి పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ధైర్యంగాఫిర్యాదు చేయాలన్నారు.

వృత్తివిద్యా కోర్సుల్లో మహిళలకు శిక్షణ

కొందుర్గు: యూనియన్ బ్యాంక్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, స్వర్ణ భారత్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు వివిధ రంగాల్లో వృత్తివిద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ మహేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గం వర్క్స్, టైలరింగ్, బ్యూటీషియన్, జూట్ బ్యాగ్‌ల తయారీ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. పూర్తి వివరాల కోసం 93914 87797, 91771 41712 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హామీలను అమలు చేయాలి

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీంలను ఖచ్చితంగా అమలు చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు తనకు మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారని.. తనహయాంలో కల్వకుర్తి అభివృద్ధికి కృషిచేశానని చెప్పారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల మధ్యే ఉంటానని జైపాల్‌యాదవ్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలతో సఖ్యతగా మెలగాలి

డీసీపీ నారాయణరెడ్డి


సిబ్బందికి సూచనలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి


కడ్తాల్: కడ్తాల్ పోలీస్ స్టేషన్‌ను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడాదికాలంగా నమోదైన కేసుల వివరాల గురించి ఆరా తీయడంతో పాటు రికార్డులను పరిశీలించారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు పోలీస్ అధికారులను, సిబ్బందిని డీసీపీ అభినందించారు. ఆదేవిధంగా పోలీసుల విధులను, సమస్యలను తెలుసుకోవడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందజేశారు. ప్రజలతో సఖ్యతగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ సెక్రటరీ ఆత్మహత్య


వెంకటయ్య (ఫైల్)

షాద్‌నగర్: ఇంట్లో ఉరేసుకొని పంచాయతీ సెక్రటరీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం షాద్‌నగర్ పట్టణంలో వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన వెంకటయ్య (35) గత కొన్నేళ్లుగా కంసాన్‌పల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి షాద్‌నగర్ పట్టణంలోని సాయిబాలాజీ టౌన్‌షిప్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెంకటయ్య మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ కలహాల నేపథ్యంలో వెంకటయ్య ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుంది. మృతుడికి భార్య, ఓ బాబు ఉన్నాడు.

వ్యక్తి అదృశ్యం


మధు

ఇబ్రహీంపట్నం: ఇంటినుంచి తప్పిపోయిన వ్యక్తి ఆచూకి తెలిస్తే ఇబ్రహీంపటం పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ మైబెల్లి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపటంకు చెందిన పుట్ట మధు(34)కు మతిస్థిమితం సరిగా లేదన్నారు. సుమారు రెండు నెలల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. బంధువులతోపాటు పలుచోట్ల వెతికినా అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో అతని తల్లి ధనమ్మ పీఎస్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. తెలుగు మాట్లాడే అతను ఇంట్లో నుంచి వెళ్లిపోయినప్పుడు ఒంటిపై రెడ్‌కలర్ షర్ట్, బ్లాక్ కలర్ పాయింట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. మిస్సింగ్ కేసు నమోదు చేసామని.. మధు ఆచూకీ తెలిసినవారు ఇబ్రహీంపట్నం పీఎస్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

పెద్దమ్మగుడి మెట్రో స్టేషన్ పేరు మార్పు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌రోడ్ నం. 36లోని పెద్దమ్మగుడి మెట్రో స్టేషన్ పేరు మార్చారు. ఇప్పటి వరకు జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి పేరుతో ఈ మెట్రో స్టేషన్ కొనసాగుతోంది. ఇకనుంచి దీనిని ఎల్‌బీసీ పెద్దమ్మగుడి మెట్రో స్టేషన్‌గా పిలవనున్నారు. బుధవారం ఇందుకు సంబంధించిన నేమ్‌ప్లేట్‌ను ఎల్‌బీసీ సౌత్ సెంట్రల్ జోన్ మేనేజర్ కె. శ్యాంసుందర్ ప్రారంభించారు. ఆర్ఎం జోసెఫ్, ఎల్అండ్‌టీ ఎండీ సీఈఓ కేవీబీ రెడ్డి పాల్గొన్నారు.